ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శుక్రవారం 24 జనవరి 2025

వెల్లువెత్తిన వినతులు

- వికారాబాద్ జిల్లాలో మూడో రోజు 164 సభలు
- ఇప్పటి వరకు మొత్తం 572 సమావేశాలు పూర్తి
- నేటితో ముగియనున్న గ్రామ, వార్డు సభలు


వికారాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల్లోనే ప్రజల నుంచి నాలుగు పథకాలకు 69,635 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం వరకు 43,504 దరఖాస్తులు రాగా, గురువారం జరిగిన గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి ఏకంగా 26,131 అభ్యర్థనలు అందాయి. ఇప్పటి వరకు రేషన్ కార్డుల కోసం 43,291 దరఖాస్తులు రాగా, ఇందిరమ్మ ఇళ్లకు 18,024, రైతు భరోసా కోసం 2,208, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 6,112 దరఖాస్తులు అందాయి. గురువారం జిల్లాలో మొత్తం 164 చోట్ల గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. 137 గ్రామ సభలు, 27 వార్డు సభలు జరిగాయి. చివరి రోజైన శుక్రవారం మొత్తం 93 సభలు నిర్వహించనున్నారు. జిల్లాలో గ్రామ, వార్డు సభలు గురువారం ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. వార్డు, గ్రామ సభల్లో అర్హుల జాబితాల్లో చోటు దక్కని అర్హుల నుంచి అధికారులకు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. అర్హుల జాబితాల్లో చోటు దక్కని వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకోవడంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో గురువారం గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగా కొనసాగాయి.


కోట్‌పల్లిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- అదనపు కలెక్టర్ సుధీర్

కోట్‌పల్లి/బంట్వారం: జనవరి 23(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు బంట్వారం మండల పరిధిలోని మద్వపూర్ గ్రామసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని పేదలు ఉపాధి హామీలో 20 రోజులు పనిచేసి ఉంటే వారు ఆత్మీయ భరోసకు అర్హులవుతారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, తదితరులు పాల్గొన్నారు.


గతంలో రైతుబంధు వచ్చిన సురంగల్‌లోని క్రికెట్ స్టేడియం

జిల్లాల వారీగా వివరాలు (సాగు చేయని భూములు ఎకరాల్లో..)

రంగారెడ్డి	మేడ్చల్	వికారాబాద్
54,200	14,300	7,500



76వేల ఎకరాలకు కట్!

రైతు భరోసా లెక్కలు తేలుస్తున్న అధికారులు

- ఉమ్మడి జిల్లాలో తుది దశకు కసరత్తు
- శివారులో భారీగా అనర్హుల ఏరివేత
- వెంచర్లు, రోడ్లు, స్టేడియాలకూ గతంలో రైతుబంధు
- సర్వే అనంతరం వాటిని తొలగిస్తున్న ప్రభుత్వం

గడిచిన కొన్నేళ్లుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సాగు చేయకపోయినా రైతు బంధు కింద రూ.వందల కోట్లు ఫలహారంగా పంచిపెట్టారు. భూసేకరణ చేసి రోడ్లు వేసిన భూములతో పాటు కాలనీలు, వెంచర్లు, కోళ్లఫారాలు, క్రికెట్ గ్రౌండ్లు, ఫంక్షన్ హాళ్లు ఉన్న భూములకు సైతం రైతు బంధు కింద రూ.కోట్లు చెల్లించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు అనర్హులందరినీ జాబితా నుంచి ఏరిపారేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అర్హత లేని దాదాపు 76వేల ఎకరాలను ఇప్పటి వరకు అధికారులు గుర్తించారు. గురువారం నాటికి రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 54,200 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 14,300 ఎకరాలు, వికారాబాద్‌లో 7,500 ఎకరాల వరకు వ్యవసాయ యోగ్యత లేని భూములుగా గుర్తించారు.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని ప్రకటించడంతో అధికారులు ఇపుడు లెక్కలు తేల్చేపనిలో పడ్డారు. అధికారుల పరిశీలనలో కళ్లు చెదిరే నిజాలు బయటపడుతున్నాయి. వెంచర్లు వేసి కాలనీలు ఏర్పాటైన ప్రాంతాలకు కూడా రైతుబంధు ఇస్తున్నట్లు తేలింది. అప్పట్లో భూములు కొనుగోలు చేసి వెంచర్లు వేసిన వారు మ్యూటేషన్ చేయించుకోకపోవడంతో పాత రైతుల పేర్లే రికార్డుల్లో కొనసాగుతున్నాయి. ఇందులో కాలనీలు వచ్చి పెద్ద పెద్ద భవన నిర్మాణాలు వచ్చినప్పటికీ ధరణి వచ్చిన తరువాత మ్యుటేషన్ లేని భూములకు కొత్తపాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. వ్యవసాయేతర భూములు అంటే పరిశ్రమలు ఉన్న ప్రాంతాలకు

మిగతా 7వ పేజీలో...


కలెక్టర్‌ను కలిసిన అనురాధ మెడోస్

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

రీజినల్ డైరెక్టర్ అనురాధ మెడోస్

వికారాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ రీజినల్ డైరెక్టర్ అనురాధ మెడోస్ సూచించారు. ఆమె మూడో రోజు గురువారం డీఎంహెచ్‌వో వెంకటరమణతో కలిసి వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. అక్కడ వైద్య విద్యార్థులకు విద్యతో పాటు మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉండేలా ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. అనంతరం మహవీర్ మెడికల్ కళాశాలను సందర్శించి అక్కడ సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రోగ్రామ్ ఆఫీసర్లతో కలిసి మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు.


మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం నవాబుపేట మండలంలోని మాదిరెడ్డిపల్లి గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుపై అపోహలు వద్దన్నారు. నవాబుపేట మండలంలో 6,237 మంది రైతులకు రూ.43 కోట్లు రుణమాఫీ జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, రామ్‌రెడ్డి, రాథోడ్ గీతసింగ్ తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో దట్టంగా అలుముకున్న పొగమంచు

తగ్గని చలి!

ఉమ్మడి జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు

- రెడ్డిపల్లి, మర్పల్లిలో 10.8 డిగ్రీలు నమోదు
- ఉదయం వేళ వీస్తున్న చల్లని గాలులు
- పొగమంచుతో వాహనదారుల ఇబ్బందులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు

ఘట్‌కేసర్‌ను కమ్మేసిన పొగమంచు

ఘట్‌కేసర్‌ను గురువారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వేకువజామున 6గంటల నుంచి ఎనిమిది గంటల వరకు పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత పెరుగుతున్నా పొంగమంచు ప్రభావం తగ్గలేదు.

రంగారెడ్డి అర్బన్/ఘట్‌కేసర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ తర్వాత తగ్గాల్సిన చలి తీవ్రత తగ్గలేదు. నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లి, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో గురువారం 10.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మేడ్చల్-మల్కాజిరిగి జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పడిపోయిన ఉష్ణోగ్రతలకు తోడు ఉదయం వేళ చల్లని గాలులు వీస్తున్నాయి. ప్రధానంగా తెల్లవారుజామున పొగమంచు కప్పేస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటలు దాటినా ఆ ప్రభావం అలాగే ఉంటోంది. దీంతో రోడ్లపైకి వచ్చే వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలను నడిపించాల్సి పరిస్థితులు తలెత్తుతున్నాయి.

మోస్తరుగా కాస్తున్న ఎండ

మధ్యాహ్నం సమయంలో సాధారణంగా, రాత్రి సమయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. చలి తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయాన్నే ఉద్యోగాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా ఎండ కాస్తోంది. పగలు, రాత్రుళ్లు సైతం చలి ప్రభావం కొనసాగుతుంది. చలి తీవ్రతతో చర్మం పొడిబారి

మిగతా 7వ పేజీలో...

ధారూరు రైల్వేస్టేషన్‌లో రైళ్లను ఆపాలి

రైల్వే జీఎంకు బీజేపీ నాయకుల వినతి


రైల్వే డీజీఎంకు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ధారూరు, జనవరి23(ఆంధ్రజ్యోతి): హుబ్లీ, బీజాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు, తాండూర్ ప్యాసింజర్ రైళ్లను ధారూరు రైల్వే స్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డీజీఎం ఉదయ్‌నాథ్‌లకు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, నియోజకవర్గ కో ఆర్డీ నేటర్ వి.నందు, మండలాధ్యక్షుడు రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానంద రెడి గురువారం వారిని కలిసి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సిపారసు లేఖను అందజేశారు. గతంలో ఈ రైళ్లకు ధారూరు రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉందని, కొంత కాలంగా ఈ రైళ్ల హాల్టింగ్‌ను నిలిపివేశారని లేఖలో పేర్కొన్నారు. దీని కారణంగా ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులకు అసౌకర్యంగా మారిందని వివరించారు. ధారూరు రైల్వే స్టేషన్‌లో హుబ్లీ, బీజాపూర్ ఎక్స్‌ప్రెస్, తాండూరు ప్యాంసింజర్ రైళ్లను నిలిపేలా చర్యలు తీసుకుని ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల వేగవంతానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి సంబంధిత శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెకర్లు ప్రతీక్‌జైన్, సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే మంజూరైన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బొంరాస్‌పేట్, గుండుమాల్ మండలాల్లో చేపట్టే సమీకృత పాఠశాల భవనాలను వారం రోజుల్లో చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టే పనులతో పాటు వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంబంధించిన పనులను కూడా త్వరగా ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా వెటర్నరీ, వైద్య కళాశాలల నిర్మాణ మ్యాప్‌లను పరిశీలించారు. సమావేశంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమాహారతి, గరిమ నరుల, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఆర్డీవో రాంచందర్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ వైవి.రాంకుమార్, డీఈ రాజు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ, డీఈలు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు తీర్చిదిద్దిన ముగ్గులు

అలరించిన రంగవల్లులు

మేడ్చల్ కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవ్వాన పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని విభాగాల మహిళా ఉద్యోగినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 విభాగాలకు సంబంధించిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా పంచాయతీ కార్యాలయం, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, ఆరోగ్య శాఖ, స్త్రీ వికలాంగుల శాఖల మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు. పోటీలో పశుసంవర్ధక శాఖ వారి ముగ్గు మొదటి స్థానంలో, రెవెన్యూ శాఖ 2వ, గ్రామీణాభివృద్ధి సంస్థ వారి ముగ్గు 3వ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ షాప్‌లో భారీ అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- రూ.కోటికి పైగా ఆస్తి నష్టం

మేడ్చల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ పట్టణంలో ఓ ఎలక్ట్రికల్ షాపులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఆ దుకాణం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో దాదాపు రూ.కోటికిపైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న పాలీక్యాబ్ శానిటేషన్ ఎలక్ట్రికల్ షాపులో గురువారం ఉదయం లోపల మంటలు చెలరేగుతూ పొగలు వచ్చాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మంటలను చల్లార్పటానికి అగ్నిమాపక దళాన్ని రప్పించారు. షాపు యజమాని వినోద్ అందుబాటులో లేక పోవడంతో షెట్టర్‌ను బద్దలుకొట్టి మంటలను చల్లార్చారు. లోపల పెయింట్ డబ్బాలు ఉండటంతో దుకాణం పూర్తిగా కాలి బూడిదైంది. యజమాని అందుబాటులో లేక పోవడంతో అతని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు యజమాని వినోద్ ప్రమాదం జరిగిన భవనం పైఅంతస్తులో నివసిస్తున్నాడని, నాలుగు రోజుల క్రితమే ఊరెళ్లినట్లు బంధువులు పోలీసులకు తెలిపారు. దొంగలు షట్టర్ బద్దలు కొట్టి షాపులో చొరబడి చోరీకి పాల్పడిన అనంతరం షాపుకు నిప్పంటించి వెళ్లారన్న అనుమానాలు వ్యక్తం చేసిన్నారు. దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలించగా దుకాణం ముందు భాగంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లేకపోవడం అనుమానాలకు తావిస్తుందని పోలీసులు అంటున్నారు.

మాదిగల ఐక్యతను చాటాలి

» ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ


ఎన్నిక పత్రం అందుకుంటున్న నూతన అధ్యక్షుడు శ్రీశైలం

ఆమనగల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వేల గొంతులు, లక్ష డప్పులు మహాప్రదర్శన విజయవంతం ద్వారా రాష్ట్రంలో మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టుగల్ల ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ పిలుపు నిచ్చారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న వేల గొంతులు, లక్ష డప్పులు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి మల్లేపోగు మల్లేశ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ బలోపేతం, నిరసన కార్యక్రమం విజయవంతం గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ వ్యతిరేక శక్తుల గుండెలు అదిరెలా వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిని కావలి శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా కొప్పు జంగయ్య, రమేశ్, కార్యదర్శిగా కంబాలపల్లి పర్వతాలు, సోషల్ మీడియా ప్రచార కార్యదర్శిగా జంతుక విజయ్ కుమార్, కోశాధికారిగా కొప్పువిజయ్, కార్యవర్గ సభ్యులుగా కేశయ్య, పుల్లయ్య, లను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు మైసయ్య, కొప్పు యాదయ్య, కావలి రమేశ్, జంతుక పర్వతాలు, వగ్గు శ్రీశైలం, జంతుక శివ, సుదర్శన్, క్రీస్తు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటులో విఫలం

» తాండూరు మున్సిపాలిటీలో చిమ్మ చీకట్లు

» పట్టించుకోని అధికారులు


డాగ్ బంగ్లా మార్గంలో లైట్లు వెలుగని దుస్థితి

తాండూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్లు చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ప్రజలు చీకట్లో పడరాని ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం వీధీ దీపాల ఏర్పాట్లలో పూర్తిగా విఫలమైంది. పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా (బస్టాండ్ ముందు)లో ఉన్న హైమాస్ట్ లైట్లు వెలుగక 15 రోజులైయింది. డాగ్ బంగ్లా రోడ్డు మార్గంలో ఆరు స్తంభాలపై లైట్లు పూర్తిగా వెలుగక పోగా మిగితా స్తంభాలకు ఒక సైడు వెలిగితే మరో సైడు వెలుగని పరిస్థితి. కోర్టు నుంచి జిల్లా ఆస్పత్రి గేటు వరకు లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు మార్గం డీఎస్పీ ఆఫీస్ సర్కిల్‌లో హైమాస్ట్ లైట్లు వెలుగక 20 రోజులు దాటిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అంబేద్కర్ చౌరాస్తా, డీఎస్పీ ఆఫీస్ సర్కిల్, డాగ్ మార్గంలో 24 గంటల పాటు జనం, వాహదనారులు రాకపోకలు సాగిస్తుంటారు. లైట్లు మరమ్మతులు చేయడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పూర్తిగా విఫలమైంది. దీనిపై కమిషనర్ పర్యవేక్షణ కొరవడింది. తాండూరు బల్దియాపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించాలని తాండూరు ప్రజలు కోరుతున్నారు.

బైక్‌లు చోరీకి గురైనా పట్టించుకోరా?

» 'చందన బ్రదర్స్' కార్మికుల ఆందోళన

షాద్‌నగర్ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న కార్మికుల మోటార్ సైకిళ్లు చోరీకి గురైనా యాజమాన్యం పట్టించుకోవడం లేదని గురువారం కార్మికులు ఆందోళన చేపట్టారు. శ్రీనివాస్, గణేష్ అనే కార్మికుల రెండు మోటార్ సైకిళ్లు ఈనెల 11న షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో గల చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ వద్ద పార్క్ చేయగా చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. ఈమేరకు న్యాయం చేయాలని తోటి కార్మికులతో కలిసి బాధితులు ఆందోళనకు దిగారు. రోజులు గడుస్తున్నా తమకు న్యాయం చేయడం లేదని అన్నారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. యాజమాన్యం న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, చోరీకి గురైన రెండు బైకుల్లో ఒకటి రోడ్డుపక్కన దొరికినా ధ్వంసమైంది ఉందని బాధితులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

ఆమనగల్లు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో కనుగొని గురువారం బాధితుడికి అప్పగించారు. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు.. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన కుమార్ ఆమనగల్లు పట్టణంలో ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దాంతో కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమనగల్లు పోలీసుల సహకారంతో సీఈఐఆర్ పోర్టల్ లో దరఖాస్తు చేయగా పోలీసులు సాంకేతికతతో ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా సీఈఐఆర్ వెబ్ సైట్‌లో పూర్తి వివరాలను పొందుపరుచాలని సూచించారు.

వాహనదారులు నియంత్రణ పాటించాలి

» చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం


బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లు

చేవెళ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, రోడ్డుపై బొల్లార్డ్స్‌ను చూసి డ్రైవ్ చేయాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. గురువారం చేవెళ్ల మండలంలో ప్రధాన రోడ్ల వెంబడి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై, మూలమలుపుల వద్ద బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్టేజీల వద్ద వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్‌లు,పాల్గొన్నారు.,

ప్రజాగ్రహాన్ని గ్రహించే పథకాల అమలు


సమావేశంలో మాట్లాడుతున్న నేనావత్ పత్యానాయక్

ఆమనగల్లు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో విఫలమై ప్రజాగ్రహాన్ని గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు పథకాల పేరుతో గ్రామ సభలు నిర్వహించి ప్రజల దృష్టిని మళ్లించేందుకు యత్నిస్తుందని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ చేపడుతున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం బీఆర్ఎస్ మున్సిపాలిటీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థలఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన పోరాటాల గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజల భ్రమలు తొలిగాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. రుణ మాఫీ, రైతు బంధు, ఆరు గ్యారెంటీల అమలు గూర్చి గ్రామ సభల్లో ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు రాసి ఇచ్చిన పేర్లు మాత్రమే లబ్ధిదారుల జాబితాలో ఉన్నాయని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎంగిళి రఘు, వస్పుల సాయిలు, డేరంగుల వెంకటేశ్, పూసల భాస్కర్, జంతుక యాదయ్య, శివకుమార్, సైదులు గౌడ్, లండం యాదయ్య, నాగిళ్ల జగన్, గణేశ్, యాదయ్య, శ్రీరాములు, మహేశ్, శివ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్/దుద్యాల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొని మాట్లాడారు. గురువారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల, హకీంపేట్, కుదురుమళ్ల, చిలుముల్‌మైలారం, సత్తర్‌కుంట తండా, ఆలేడ్ గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. హకీంపేట్ గ్రామ సభలో ఐజీ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు దుద్యాల మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దుద్యాల తహసీల్దార్ కిషన్‌నాయక్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న మేడ్చల్ బీజేపీ నాయకులు

అభివృద్ధికి సహకరిస్తా : ఎంపీ ఈటల

మేడ్చల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ మండలంలలోని గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం పూడూరు గ్రామ శివార్లలోని ఎంపీ ఈటల నివాసంలో మేడ్చల్ బీజేపీ నాయకులు కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్పందించిన ఎంపీ ఈటల మాట్లాడుతూ...మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మేడ్చల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రైల్వే అండర్ పాస్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి అయ్యేలా చూస్తామని, అండర్ పాస్ వద్ద నుంచి రాయిలాపూర్ వరకు రోడ్డు నిర్మించటానికి, రాయిలాపూర్ నుంచి గౌడవెల్లి గ్రామాల మధ్య కల్వర్టు నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణం బీజేపీ అధ్యక్షురాలు జె.శైలజ హరినాథ్, మాజీ అధ్యక్షుడు కె.ఆంజనేయులు, గిర్మాపూర్ కౌన్సిలర్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అనురాగ్ యూనివర్సిటీ డీన్లు, అధ్యాపకులు

తేజస్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించే తేజస్ 2కె25-ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనురాగ్ డీన్ విజయ్‌కుమార్ కోరారు. 27న జరిగే ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. తేజస్ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతికత పెంపొందుతాయని తెలిపారు. అనురాగ్ యూనిరవర్సిటీలోని వివిధ విభాగాల్లో చేసిన 200 ప్రాజెక్టలను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఇంజినీరింగ్, ఇంటర్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కన్వీనర్ మధన్‌మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకుడు దరువు అంజన్న

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతునిద్దాం

» బీసీ నాయకుడు దరువు అంజన్న

కొడంగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి బీసీలుగా మద్దతునిద్దామని బీసీ నాయకుడు దరువు అంజన్న అన్నారు. గురువారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సంఘీభావ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఇప్పటివరకు వేసిన అన్ని కమిషన్లు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరగాలని చెప్పినా, సుప్రీం కోర్టు సైతం వర్గీకరణ చేపట్టాలని తీర్పునిచ్చిందన్నారు. అయినా అమలుకు నోచుకోకపోవడంతో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్ష డప్పులు, వేయి గొంతుకలు మహా ప్రదర్శనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారులు మోహన్‌బైరాగి, బీసీ సేనా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కన్నోజు వెంకటేశ్వర్లు, ఉద్యమాకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, కన్నోజు గోవర్ధనచారి, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు, శ్రీనివాస్, లక్ష్మప్ప, బీసీ నాయకులు మల్లేశ్‌యాదవ్, చిన్నయ్య, లాలప్ప పాల్గొన్నారు.



కౌన్సిలర్ విజయ్ కృష్ణతో కలిసి పనులు ప్రారంభిస్తున్న రాంపాల్ నాయక్

ప్రజలకు మెరుగైన వసతుల కల్పన

ఆమనగల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించామని మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు అన్నారు. 7వ వార్డు వెంకటేశ్వర కాలనీలో రూ.8.50 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం, 14వ వార్డులో రూ.7లక్షల చేపట్టే మురుగు కాల్వ, రూ.3లక్షలతో చేపట్టే తాగునీటి పైపులైన్ నిర్మాణం పనులకు గురువారం కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలతో కలిసి రాంపాల్‌నాయక్ భూమిపూజ చేశారు. మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, కౌన్సిలర్లు విక్రమ్‌రెడ్డి, లక్ష్మణ్, కృష్ణయాదవ్, నాయకులు శ్రీశైలం యాదవ్, గోరటి నర్సింహ, మేడిశెట్టి శ్రీధర్, రాములు, యాదయ్య, వెంకటయ్య, మహేశ్, లింగప్ప, హుస్సేన్, మాధవాచారి, సాయిలు, శేఖర్, ఎర్రవోలు శ్రీను, రాంరెడ్డి పాల్గొన్నారు.

76వేల ఎకరాలకు కట్!

(ఐదో పేజీ తరువాయి)

సైతం రైతు బంధు ఇచ్చారు. బీడు భూములు మాట అటుంచితే కొన్నేళ్ల నుంచి నిర్మాణాలు ఉన్న భూములకు రైతుబంధు ఇస్తున్న విషయాలు విచారణలో ఇపుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో నగర శివారు ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి.

రేపటికి తుది నివేదిక సిద్ధం

ఇలాంటి వాటిని గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలికి తీసి ప్రత్యేక కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగురోడ్డు, జాతీయ రహదారులకు కొన్నేళ్ల కిందట సేకరించిన భూములకు సైతం రైతుబంధు ఇస్తున్న విషయం వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం వీటన్నింటిపైనా విచారణకు ఆదేశించింది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు పేరు మార్చి రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీన రైతు భరోసా పథకాన్ని ప్రారంభించనుంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో అనర్హులను ఏరివేసే ప్రక్రియ ఈనెల 25లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి అనర్హులను గుర్తిస్తున్నారు. అనర్హులను జాబితా నుంచి తొలగించి శనివారం సాయంత్రానికి తుది జాబితా ప్రకటించనున్నారు.

నివ్వెరపోయే నిజాలు



క్షేత్రస్థాయి పరిశీలనలో విస్తుపోయే విషయాలు బయటకు వస్తుండడంతో అధికారులు సైతం నివ్వెరపోతున్నారు. గడిచిన పదేళ్లలో ఈ వ్యవసాయేతర భూములకు ఇచ్చిన రైతు బంధు సుమారు రూ.450 కోట్ల వరకు ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 6.90 లక్షల ఎకరాల భూములకు రైతు బంధు ఇచ్చే వారు. ఇందులో 54,200 ఎకరాలకు అర్హత లేదని తేలడంతో వీటిని జాబితా నుంచి తొలగించనున్నారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 77,984 ఎకరాల భూములు ఉండగా 14,300లకు రైతుభరోసా కట్ కానుంది. వికారాబాద్ జిల్లాలో 61,6972 ఎకరాలు ఉండగా ఇందులో 7500 ఎకరాలు వ్యవసాయ యోగ్యత లేదని తేల్చారు. క్షేత్రస్థాయిలో సర్వే ఇంకా కొనసాగుతున్నందున అనర్హత భూముల జాబితా మరికొంత పెరిగే అవకాశం ఉంది.

ఇవే ఉదాహరణలు

రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మండలం ఎన్కేపల్లిలోని సర్వేనంబరు 80లో ఆరుగురికి 17.12 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులో రెండు క్రికెట్ గ్రౌండ్లు ఉన్నాయి. మిగతా కొంత భూమిలో మామిడి తోటలు, సాగు భూమి ఉంది. ఈ క్రికెట్ గ్రౌండ్ ఉన్న భూమికి కొన్నేళ్లుగా రైతుబంధు ఇస్తున్నారు. అలాగే ఎన్కేపల్లి సర్వేనంబరు 184లో 15 మందికి 12.32 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులోని కొంత భూమిలో కోళ్ల ఫారాలు, డెయిరీ ఉన్నాయి. అలాగే సురంగల్ సర్వేనంబరు 351లో 16 మంది పట్టాదారులకు 17.12 ఎకరాలు ఉండగా క్షేత్రస్థాయి విచారణలో కోళ్లఫారాలు ఉన్నట్లు తేలింది. సర్వేనంబరు 297లో 7.14 ఎకరాల పట్టా భూమి ఉండగా ఇందులో కొంత భూమి వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు అధికారులు విచారణలో తేలింది.



సీపీఎం మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

కొడంగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే మహాసభల పోస్టర్‌ను గురువారం కొడంగల్‌లో విడుదల చేశారు. ఉద్యమాల పోరాట సారథి, కష్టజీవుల గొంతుక సీపీఎం రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజల పక్షాన నిలబడుతుందని తెలిపారు. మహాసభలకు కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, మల్లయ్య, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తారా.. కరెంట్ తీగలు పట్టుకోమంటారా?

» డీడీలు కట్టి 7 నెలలైనా రైతుకు అందని ట్రాన్స్‌ఫార్మర్

» అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



డీడీలను చూపిస్తున్న రైతు వజీర్

చౌదరిగూడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తారా.. కరెంటు తీగలు పట్టుకోమంటారా అని ఓ రైతు తన గోడు వెళ్లబోసుకున్నాడు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ఓ రైతు డీడీలు చెల్లించి దాదాపుగా ఏడు నెలలు కావస్తున్నా.. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ సమకూర్చడం లేదని, కరెంటు ఆఫీస్ చుట్టు కాళ్లరిగేలా తిరిగినా అధికారులు కనికరించడం లేదని వాపోయాడు. కాగా, మా దగ్గర ఏమైనా ట్రాన్స్‌ఫార్మర్ తయారు చేసే మిషన్ ఉందా? స్టాక్ వచ్చినప్పుడు ఇస్తాం అంటూ రైతుపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు బాధిత రైతుల మీడియాకు వివరించాడు. వివరాల్లోకి వెళితే.. కొందుర్గు మండల కేంద్రానికి చెందిన మహ్మద్ వజీర్ తన వ్యవసాయ పొలంలో పశువుల నీటికోసం బోరు వేయించాడు. కరెంట్ సౌకర్యం లేకపోవడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం కరెంట్ ఆఫీసుకు వెళ్లితే.. మూడు డీడీలు చెల్లించాలని అధికారులు చెప్పడంతో గతేడాది జూన్‌లో తీశాడు. అయితే, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వజీర్ వాపోయాడు. డీడీలు పట్టుకొని కరెంట్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నానని.. స్తంభాలను నేనే ట్రాక్టర్‌లో తీసుకెళ్లి పొలంలో పాతినట్లు చెప్పాడు. అధికారులు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదని.. ఎమ్మెల్యే సారైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

తగ్గని చలి!



(ఐదో పేజీ తరువాయి)

పగుళ్లు రావడంతో పాటు అలర్జీ, చర్మం ఎర్రబడటం, దురద వంటి శీతాకాలపు చర్మవ్యాధులు, అస్తమా వ్యాధిగ్రస్తులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో సతమతమయ్యే అవకాశం ఉంది. చలి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సూచనలు చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, వృద్ధులు చలిగాలుల నుంచి రక్షణ పొందడంతో పాటు గాలి నేరుగా తగలకుండా చూసుకోవాలి. చలిగాలి వీస్తున్నప్పుడు ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా ఉండేలా పొడి దస్తులు, ఊలు, స్వెటర్లు ధరించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

చలి తీవ్రత కారణంగా అన్ని వయసుల వారితో పాటు పిల్లల్లో జలుబు, దగ్గు, జ్వరం తదితర సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. శ్వాసతీసుకోవడంతో ఇబ్బంది ఎదురైతే వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. నెలలోపు చిన్నారులకు స్నానం చేయించొద్దు. పిల్లలను వేడిగా ఉండే గదుల్లో ఉంచాలి. కాటన్ దుస్తులు తొడిగి, చలి తీవ్రతను బట్టి దుప్పట్లు కప్పాలి. పిల్లలను బైక్‌లపై ముందు కూర్చొబెట్టుకోవద్దు. ఫ్యాన్ కింద నేరుగా పడుకోవద్దు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు అత్యంత జాగ్రత్తగా ఉండటం తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారిలో రక్తనాళాలు కుచించుకుపోవడంతో పాటు రక్తం గడ్డకట్టే సమస్యలు అధికంగా ఉంటాయంటున్నారు. వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వంట చేసుకుని తినడం మేలని సూచిస్తున్నారు.

ఏడాదిలో 25 కోట్లు దుబారా!



తాండూరు బల్దియా

తాండూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ పాలకవర్గం గడువు 26వ తేదీ(ఆదివారం)తో ముగియనుంది. సోమవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనుంది. ఐదేళ్లలో రూ.కోట్లలో నిధులు ఖర్చు చేసినా అభివృద్ధి మాత్రం అంతంతమాత్రమే. అవినితి, అక్రమాలతో పాలన సాగడంతోపాటు తాండూరు మున్సిపాలిటీ వివాదాల్లోకి ఎక్కడంతో రాష్ట్ర స్థాయి దృష్టి పడింది. కోర్టు, లోకయుక్త కేసులతో అధికారులు సతమతమయ్యారు. చెరి రెండున్నరేళ్ల పాలన ఒప్పందం మేరకు చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీపాలను అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పందం కుదిర్చించింది. పదవి కాలం తర్వాత చైర్‌పర్సన్ స్వప్న తప్పుకునేందుకు అంగీకరించకపోవడంతో ఇద్దరి మధ్య వివాదాలు జరిగాయి.

వివాదాల్లో చైర్‌పర్సన్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నకు దొంగ ఓటు వ్యవహారం మెడకు చుట్టుకొంది. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని చైర్‌పర్సన్ మీడియాకి ఎక్కి సంచలనం అయ్యారు. తర్వాత బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్ స్వప్నపై విపక్ష కౌన్సిలర్లు అవినితి అక్రమాలపై లోకయుక్తలో, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న ఆర్డీఓపై, కలెక్టర్, మున్సిపల్ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టులో రిట్‌వేసి చైర్‌పర్సన్ సంచలనం అయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అవిశ్వాసం నుంచి తప్పించుకునేందుకు ఆమె హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు, నాన్‌వెజ్ వ్యర్థాల టెండర్ ప్రక్రియ, శానిటేషన్ నిర్వహణ, జేసీబీ మాయం, అడ్డగోలుగా ఫర్నిచర్ కొనుగోలు, ఏడాదిలోనే కార్మికులకు సైతం వేతనాలు చెల్లించే పరిస్థితి లేకుండా ఒకేసారి రూ.25 కోట్లు దుబారా వ్యయం చేయడం వివాదాలకు తావిచ్చింది. వంద ఫీట్ల జాతీయ జెండాను బల్దియా ఎదుట ఏర్పాటు చేయడం, నూతన మున్సిపల్ భవనం ప్రారంభం కౌన్సిల్ ఐదేళ్ల పాలనలో ప్రత్యేకం.



గీతాలక్ష్మీపట్నాయక్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

వికారాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా డాక్టర్ పీవీ గీతాలక్ష్మీ పట్నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను వైస్ ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు చిన్న సోమన్న, డాక్టర్ వీందర్ మల్లయ్య డాక్టర్ కరీముల్లా సుజాత శ్వేత, ప్రభు, కిషన్ రావు, కృష్ణయ్య, మహేశ్వరి, హేమలత, సిబ్బంది శివకుమార్ యాదయ్య, సాయి, కుమారి, శంకరయ్య, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



మహేశ్‌కు అవార్డు అందిస్తున్న ఓయూ వీసీ కుమార్

దోనాదుల మహేశ్‌కు వివేకానంద యూత్-2025 అవార్డు

కడ్తాల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కార్యదర్శి బీజేపీ కడ్తాల మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్‌ను ప్రతిష్టాత్మకమైన వివేకానంద యూత్-2025 జాతీయ అవార్డు వరించింది. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రతీఏటా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, అన్నదాన కార్యక్రమాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టిన మహేశ్‌ను అవార్డు ఎంపిక చేశారు. వివేకానందుడి 162వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీ కుమార్ మొలుగురం ముఖ్య అతిథిగా హాజరై మహేశ్‌కు అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించి అభినందించారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పీఎస్ నారాయణ, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు రాజ్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షమ పథకాలు అర్హులకు చేరేలా కృషి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి కోరారు. ప్రతాప్‌సింగారానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు గురువారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు చేరేవిధంగా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని, అందరి సమస్యలు తొలుగుతాయని పేర్కొన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందుతాయని చెప్పారు. ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బద్దం కుమార్, అబేద బేగం, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, నాయకులు నత్తి కృష్ణ, విజయ్‌కుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాంపల్లి కార్యవర్గం ఎన్నిక

కీసర రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌పీఎస్ నాగారం మున్సిపాలిటీ రాంపల్లి అధ్యక్షుడిగా బండెల పరమేశ్ నియమితులయ్యారు. గురువారం రాంపల్లిలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పంగ ప్రవీణ్‌మాదిగ వారికి నియామకపత్రం అందజేసారు. ఉపాధ్యక్షుడిగా మీసాల భాస్కర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మంచాల నర్సింగరావు మాదిగ, కార్యదర్శిగా పొడవళ్ల రవి మాదిగ, కార్యవర్గ సభ్యులుగా మంచాల మహేందర్‌మాదిగ, మీసాల మల్లేష్‌మాదిగ, మంచాల రాహుల్‌కృష్ణమాదిగ, పొడవళ్ల భిక్షపతి, పొడవళ్ల ఈశ్వర్, చెట్లపల్లి విజయ్‌కుమార్, కొమ్ము ఎల్లం, బండెల వెంకటేష్, నల్లోల్ల బాబు, ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నగేష్‌మాదిగ, మధుమాదిగ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'గుర్రం పీర్' జాతర

» నాలుగు రోజుల పాటు ఉత్సవాలు

» గుర్రంపల్లిలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



గుర్రంపల్లిలో కొనసాగుతున్న ఏర్పాట్లు



స్వయంభువుగా వెలసిన రాతి గుర్రం

చౌదరిగూడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుర్రంపల్లిలోని గుర్రం పీర్ జాతరకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ స్వయంభువుగా వెలిసిన గుర్రం ఆకారంలోని రాతి విగ్రహాన్ని దర్శించుకుంటే చిన్న పిల్లలకు గ్రహ దోషం, మానసిక, శారీరక రుగ్మతలు, భూతప్రేత సంబంధమైన అనేక రోగాలు నయమవుతాయని నమ్మకం. జిల్లేడ్ చౌదరిగూడ మండల గుర్రంపల్లిలోని గుర్రం పీర్ జాతర సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పసి పిల్లను ఐదు వారాల పాటు గుర్రం విగ్రహం చుట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకుంటే అంతా మంచి జరిగి ఆరోగ్యంగా ఉంటారని ప్రతీతి. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, వికారాబాద్ వంటి సదూర ప్రాంతాల నుంచి భక్తులు గుర్రం పీర్ దర్శనానికి వస్తుంటారు. గుర్రంపల్లిలో గ్రామ ప్రజలు, ధర్మకర్తల ఆధ్వర్యంలో జరిగే జాతరలో భాగంగా మొదటి రోజు శుక్రవారం 24న విగ్రహానికి గంధం అలంకరణ, 25న దీపధూప నైవేద్యం సమర్పణ, 26న కందూరు, 27న భజన కార్యక్రమాలతో ఉర్సు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ తెలిపారు. సదూర ప్రాంతాల నుంచి గుర్రంపల్లి జాతరకు వచ్చే ప్రయాణికులకు షాద్‌నగర్ నుంచి పరిగి వెళ్లే బస్సులు లాల్‌పహాడ్ వరకు గాలిగూడ, పీర్లాపూర్ వెళ్లే బస్సులు, లాల్‌పహాడ్ నుంచి ఆటోల ద్వారా గుర్రంపల్లి జాతరకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది.



బొంరాస్‌పేట్ గ్రామ సభలో ఎస్పీ, డీఎస్పీ



దోమ మండల కేంద్రంలో ప్రజాపాలన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మక్తవెంకటాపూర్ గ్రామసభలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్

దరఖాస్తుల వెల్లువ

మూడోరోజు ప్రజాపాలన గ్రామసభలలో పాల్గొన్న అధికారులు, నాయకులు

బొంరాస్‌పేట్: అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు మంజూరవుతాయని ప్రత్యేకాధికారులు సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్ గౌడ్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీవో మహేశ్ కుమార్ అన్నారు. గురువారం బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్, రేగడిమైలారం, తుంకిమెట్ల గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. బొంరాస్‌పేట్, తుంకిమెట్ల గ్రామ సభల్లో వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమ, కులకచర్ల: అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేటట్లు చర్యలు తీసుకుంటామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపూర్‌లో రూ.3కోట్ల 13 లక్షలతో విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన, దోమలో ప్రజాపాలన సదస్సు, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ మాడల్ ఇంటి నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు, వివిధ శాఖల అధికారులు నాయుడు, సూర్యనాయక్, సంజీవ్, ప్రతిభ, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు, ఏవో ప్రభాకర్‌రావు, సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ / కొడంగల్ రూరల్ / దౌల్తాబాద్, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. గురువారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 9,10,11,12 వార్డుల్లో ప్రజాపాలన సదస్సు లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొడంగల్ మండలంలోని అలేడ్, హస్నాబాద్, అంగడిరైచూర్, కస్తూర్‌పల్లి, ఖాజఅహ్మద్‌పల్లి, పర్సాపూర్, ప్యాలమద్ది, రావుల్‌పల్లి, రుద్రారం గ్రామాల్లో, దౌల్తాబాద్ మండలంలోని దేశాయిపల్లి, దేవరఫస్లాబాద్, నందారం, గుమ్మాల్, కుప్పగిరి, బాలంపేట్, సురయిపల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు శశాంక్‌మిశ్రా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: పర్సాపూర్‌లో అధికారులకు దరఖాస్తులు అందిస్తున్న లబ్ధిదారులు

చౌడాపూర్: లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం మక్తవెంకటాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు, పంచాయతీ కార్యదర్శి మహేశ్‌రెడ్డి, రాందాస్ పాల్గొన్నారు.

పరిగి రూరల్: కాంగ్రెస్ అంటేనే భద్రత, భరోసా అని మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి అన్నారు. పరిగి మండల పరిధిలోని సయ్యద్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. జనవరి 26న రైతు భరోసా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఏడీ సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల విషయంలో ప్రజలు ఎవరు ఎలాంటి ఇబ్బందులకు గురికావొద్దని అర్హులందరి ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వసంత ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్ : గ్రామసభల్లో రేషన్‌కార్డులపై అధికారులను గ్రామస్తులు నిలదీస్తున్నారు. ఏళ్ల తరబడి రేషన్‌కార్డులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గురువారం మండలంలోని ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాప్‌సింగారం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు.

మోమిన్‌పేట్: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం దుర్గం చెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మర్పల్లి: అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయని తహసీల్దార్ మునిరోద్దీన్ అన్నారు. గురువారం కోటమర్పల్లి, పట్లూర్, పంచలింగాల, నర్సాపూర్, పిల్లిగండ్ల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

మేడ్చల్ టౌన్ : ఇందిరమ్మ, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక సరిగా జరగలేదంటూ సభల్లో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరంగవరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లబ్ది దారుల ఎంపిక సరిగా జరగలేదంటూ నిలదీశారు.

తాండూరు రూరల్ : తాండూరు మండల పరిధిలోని 8గ్రామాల్లో మూడో రోజు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా కొనసాగాయి.



ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద వార్డుసభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

కీసర: ప్రజాపాలనలో భాగంగా గురువారం గోధుమకుంట, యాద్గార్‌పల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ మేరకు కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లు గ్రామసభలో చదివి వినిపించారు.

మూడుచింతలపల్లి: మూడుచింతలపల్లి మండలంలోని కేశవపూర్, పోతారం, నారాయణపూర్ గ్రామాలలో గురువారం లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలను నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేయబోతున్న 4 పథకాల్లో ఒకటైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో నిరుపేదలకు కాకుండా ఇళ్లు ఉన్నవారికి ఇండ్లు వచ్చాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు.

బషీరాబాద్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గురువారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఎక్మాయిలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, పర్వత్‌పల్లిలో పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, మాసన్‌పల్లిలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, మంతట్టిలో తహసీల్దార్ వెంకటేష్, ఇందర్‌చెడ్‌లో ఏవో అనిత, మర్పల్లిలో జయకర్ అధ్యక్షతన గ్రామ సభలు కొనసాగాయి.

కోట్‌పల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో డానియల్ తెలియజేశారు. గురువారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను గుర్తించి అర్హులైన వారికి పథకాలు అందజేస్తామని అన్నారు.

శామీర్‌పేట : శామీర్‌పేట మండలంలో మూడో రోజు గురువారం ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగాయి. మండలంలోని మురహరిపల్లి, యాడారం, తుర్కపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ మమతాబాయి ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు.

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలో ప్రజాపాలన గ్రామసభలు సాఫీగా కొనసాగాయి. సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లు చదివిన సమయంలో కొంతమంది తమపేర్లు రాలేవని కాస్త గొడవచేసినా అధికారులు వారిని సముదాయించారు.

యాలాల: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం యాలాల మండల పరిధిలోని సంగెంఖుర్దు, రాఘవాపూర్, కమాల్‌పూర్, బెన్నూరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.



కులకచర్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోం : భీమ్‌రెడ్డి

కులకచర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, యువ నాయకులు కుమ్మరి స్వామి హెచ్చరించారు. గురువారం కులకచర్ల మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు గ్రామసభ ఏర్పాటు చేస్తే ప్రతిపక్ష నాయకులు ప్రజలను రెచ్చగొట్టడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు రాంచంద్రయ్య, భరత్‌కుమార్ పాల్గొన్నారు.



గండి చెరువు తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కులకచర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. గురువారం కులకచర్ల మండలంలోని గండి చెరువు తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు కుమ్మరిస్వామి, వెంకటయ్యగౌడ్, శంకర్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వార్డు సభలు

తాండూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారంతో వార్డు సభలు ముగియనున్నాయి. తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులకుగాను గురువారం నాటికి 30 వార్డుల్లో సభలు ముగిశాయి. గురువారం నిర్వహించిన వార్డు సభలలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్‌లు రామకృష్ణ, ముక్తర్‌నాజ్, సంగీత, అంతారం లలిత, తదితరులు పాల్గొన్నారు. చివరి రోజు శుక్రవారం వివి హెచ్‌ఎస్, బసవన్న కట్ట ప్రాంతంలో జరిగే సభల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొంటారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

నేతాజీ త్యాగం మరువలేనిది

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి ● ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు, అధికారులు



నేతాజీకి నివాళులర్పిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, తదితరులు



తాండూరులో నేతాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, పాఠశాలల విద్యార్థులు

ఘట్‌కేసర్ : దేశ స్వాతంత్ర్యం కోసం అజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి రాజీలేని పోరాటం సాగించిన గొప్ప వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం ఘట్‌కేసర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరిగి రూరల్: గొప్ప దేశ భక్తి కలిగిన నాయకుడు చంద్రబోస్ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, పరిగి అసెంబ్లీ కన్వీనర్ నరసింహా, జిల్లా కార్యదర్శి పెంటయ్యగుప్త అన్నారు. పట్టణ బీజేపీ పార్టీ అధ్యక్షుడు జి.బాలక్రిష్ణరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పరిగి పట్టణ ఉపాధ్యక్షుడు రాజు, ఎస్టీ మోర్చ అధ్యక్షుడు రాజు, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.



కోటమర్పల్లి గ్రామంలో సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కీసర రూరల్ : సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శ ప్రాయమని నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్ : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లో చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘనాపూర్ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్ : మేడ్చల్ పట్టణంలోని రాజకీయ పార్టీల నేతలు, యువజన సంఘాల నాయకులు నేతాజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

తాండూరు: తాండూరులో గురుదేవ్ గురుకుల్ స్కూల్, కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు నేతాజీ వేషధారణతో వచ్చి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమ శేఖర్, బీసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: బోస్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని కాంగ్రెస్ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోటమర్పల్లి గ్రామంలో సుభాష్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శామీర్‌పేట : శామీర్‌పేటలో నేతాజీ జయంతి వేడుకలను స్టార్, చైతన్య యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట మాజీ సర్పంచ్ బత్తుల కిశోర్‌యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, యువజన సంఘం నాయకులు గుల్యాగారి చంద్రశేఖర్‌గౌడ్, దూడల వెంకటేశ్‌గౌడ్, తూంకుంట శేఖర్‌గౌడ్, నసీర్ ఖాన్, జూపల్లి ప్రసాద్, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు బండి శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



శామీర్‌పేటలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువజన సంఘం నాయకులు, నాయకులు

ఫేక్ లింకులను ఓపెన్ చేసి మోసపోవద్దు

దౌల్తాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కే.నారాయణరెడ్డి ఆదేశాలతో దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామంలో బుధవారం రాత్రి పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి, కొకైన్ నిషేధం, రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, డయల్ 100, షీ టీం 181, బాల్య వివాహాల నిర్మూలన, మానవ అక్రమరవాణా, సైబర్ నేరాలు, అంటరానితనం తదితర వాటి గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రవిగౌడ్ మాట్లాడుతూ, ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఫేక్ లింకులను ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కళాజాత బృందం సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కళాజాత బృందం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రవిగౌడ్



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సుధాకర్ రెడ్డి

రోడ్డు పనులు ప్రారంభం

వికారాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలోని ధన్నారం 2వ వార్డులో గడ్డ మైసమ్మ దేవాలయం వరకు రోడ్డు పనులను మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అర్ధ సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ తన సొంత నిధుల నుండి రూ. 30 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణం కోసం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని గృహిణి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డబీల్‌పూర్ గ్రామానికి చెందిన అశ్విని (25) అనే గృహిణి గురువారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్టు స్థానికులు పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి కూతురు ఉన్నట్టు సమాచారం.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

పరిగి రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన గురువారం పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన గణపురం శ్రీనివాస్, తన బైక్‌పై అదే గ్రామానికి చెందిన బాయి కాడి చిన్న బుచ్చయ్య(68)తో కలిసి పొలానికి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు పరిగి వచ్చారు. ఈ క్రమంలో పెట్రోల్ పంప్ వద్ద పెట్రోల్ కోసం బైక్ మలుపుతుండగా వెనుకనుంచి కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో వికారాబాద్‌లోని ఈశా హాస్పిటల్‌కు తరలించగా బాయి కాడి చిన్న బుచ్చయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్ చికిత్స పొందుతున్నాడు. కారు డ్రైవర్ అతివేగం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుమారుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

గుర్తు తెలియని శవం లభ్యం

మేడ్చల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామ శివార్లలో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మునీరాబాద్ గ్రామ శివార్లలోని జేబీ హోమ్స్ సమీపంలో ఓ వ్యక్తి మృతిచెందినట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుని వయసు 60 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

గంజాయి విక్రేత రిమాండ్

కీసర రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం... అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని మోడీ బిల్డర్స్, లోటస్ అపార్ట్‌మెంట్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న మినుముల రోహిత్, కొనుగోలు చేసేందుకు వచ్చిన వల్కంటి సాయికుమార్, కటకం వరుణ్‌చారి, మనుక లక్ష్మణ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 1.30 కేజీల గంజాయి, 100 గ్రాముల చెరస్‌ను, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మేడ్చల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావల్‌కోల్ గ్రామ 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సుకు తరలిరావాలి



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

ధారూరు, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న వికారాబాద్ పట్టణంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ సన్నాహక సద స్సుకు మాదిగలంతా తరలిరావాలని మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు టీ.నర్సింహులు మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు విచ్చేస్తున్న ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగకు మాదిగలంతా స్వాగతం పలికి సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు అనంతయ్య, నర్సింహులు, రాజు, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.